క్లుప్తంగా

క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు

- న్యాయమూర్తులు దుర్గాప్రసాద్, శ్రీధర్



క్రీడాకారులతో న్యాయమూర్తులు దుర్గాప్రసాద్, శ్రీధర్

హిందూపురం టౌన్: విద్యతో పాటు క్రీడల్లోనూ విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు సాధ్యమని తెలంగాణ నాంపల్లి మెట్రో పాలిటన్ జడ్జీ దుర్గా ప్రసాద్, హిందూపురం సీనియర్ సివిల్ జడ్జి శ్రీధర్ అన్నారు. మంగళవారం సాయంత్రం స్థానిక ఎంజీఎం పాఠశాల ఆవరణలో హిందూపురం క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) ఆధ్వర్యంలో క్రీడాకారులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తులు మాట్లాడుతూ క్రీడల్లో రాణిస్తే అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు లభిస్తుందన్నారు. ఆర్డీటీ ఫుట్‌బాల్, క్రికెట్ క్రీడాకారులను గుర్తించి వారికి ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారన్నారు. వాటిని క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌సీఏ సభ్యులు, మాజీ మున్సిపల్ చైర్మన్ విద్యాసాగర్, ఎంజీఎం హెచ్‌ఎం సామ్రాజ్యం, పీడీలు సురేష్, విలియమ్స్, అన్సార్ ఖాన్, న్యాయవాది మురళీ తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ విజేత చోళసముద్రం



విజేతకు నగదు బహుమతి అందజేస్తున్న దృశ్యం

లేపాక్షి: మండలంలోని చోళసముద్రం గ్రామంలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. సోమవారం లేపాక్షి, చోళసముద్రం జట్ల మధ్య ఫైనల్ మ్యాచ్ జరగ్గా చోళసముద్రం జట్టు విజేతగా నిలిచింది. క్రికెట్ టోర్నమెంట్ విజయం సాధించిన విన్నర్స్‌కు రూ.7 వేలు, రన్నర్స్‌కు రూ. 4 వేలు చొప్పున చోళసముద్రానికి చెందిన రామనందన్ నగదు బహుమతులను అందజేశారు.

నేడు అమ్మాజీ జాతర

రొళ్ల: మండల పరిధిలోని జీరిగేపల్లిలో శరన్నవ రాత్రి మహోత్సవాలను పురస్కరించుకుని బుధవారం అమ్మాజీ జాతర ఉత్సవాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. తమిళనాడు, కర్ణాటక రాష్ట్రంతో పాటు ఉమ్మడి అనంతపురం జిల్లా నలుమూలల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో ఉత్సవానికి హాజరుకానున్నట్లు పేర్కొన్నారు.

చలో హైదరాబాద్ పోస్టర్ల విడుదల



మాట్లాడుతున్న డీహెచ్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు హనుమంతు

మడకశిరరూరల్: ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని కోరుతూ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ చేపట్టిన పాదయాత్రకు సంఘీభావంగా నిర్వహిస్తున్న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని డీహెచ్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు హనుమంతు కోరారు. మంగళవారం మడకశిర మండలంలోని గౌరిపురంలో మాదిగల విశ్వరూప మహాసభ చలో హైదరాబాద్ కరపత్రాలను విడుదల చేశారు. నవంబర్ 7న అలంపూర్ నుంచి హైదరాబాద్ వరకు చేపట్టిన విశ్వరూప మహాసభ పాదయాత్రకు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.



అమరాపురంలో అమ్మవార్లను ఊరేగిస్తున్న దృశ్యం



పావగడ తాలూకా వైఎన్ హొసకోటలో ఊరేగింపుగా వెళ్తున్న రాజా జయచంద్రరాజు



హిందూపురం: నగరోత్సవంలో దేవుళ్ల వేషధారణలో కళాకారుల నృత్యం

సంబరంగా దసరా

సాక్షిబృందం: హిందూపురం, పెనుకొండ, మడకశిర నియోజకవర్గాల్లోని అన్ని ప్రాంతాల్లోనూ దసరా పండుగను ప్రజలందరూ అత్యంత వైభవంగా జరుపుకున్నారు. నూతన వస్త్రాలు ధరించి ఒకరికొకరు దసరా శుభాకాంక్షలు చెప్పుకున్నారు. శమీ వృక్షానికి పెద్ద ఎత్తున పూజలు చేశారు. ఆయా ప్రాంతాల్లోని అన్ని ఆలయాల్లోనూ సోమ, మంగళవారాల్లో స్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. జలధి ఉత్సవాలు, గ్రామోత్సవాలతో సందడి వాతావరణం నెలకొంది.



హిందూపురం మండలం మలుగూరులో కొండమ్మను ఊరేగిస్తున్న దృశ్యం



హిందూపురం: గవిరంగనాథస్వామికి ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకులు



అగళి మండలం కోమరేపల్లిలో గురుబిరలింగేశ్వర స్వామి జలధి ఉత్సవాన్ని నిర్వహిస్తున్న దృశ్యం



మడకశిర: వడిశలమ్మకు ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకుడు



రొద్దంలో సీతారాముల విగ్రహాల ఊరేగింపు



మడకశిర మండలం నీలకంఠాపురంలో ఎద్దుల బండ్లతో జంబు సవారీ నిర్వహిస్తున్న దృశ్యం



గోరంట్ల: మల్లమ్మను ఊరేగిస్తున్న దృశ్యం



అగళి మండలం రామాపురంలో పులివేషధారణలో నృత్యం

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

అగళి: మండల పరిధిలోని కసాపురం గ్రామం ఇటుకల ఫ్యాక్టరీ వద్ద హైవేపై సోమవారం గుర్తు తెలియని వాహనం కారు ఢీ కొనడంతో మారేగౌడ్ అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల వివరాలమేరకు... మండలంలోని గాయత్రికాలనీకి చెందిన సన్నప్ప కుమారుడు మారేగౌడ్ ద్విచక్ర వాహనంలో మందలపల్లి నుంచి గాయత్రికాలనీకి ద్విచక్ర వాహనంపై వెళ్తున్నాడు. అయితే కసాపురం వద్ద ఉన్న ఇటుకల ఫ్యాక్టరీ వద్ద గుర్తు తెలియని వాహనం మారేగౌడ్ బైక్‌ను ఢీ కొంది. తీవ్రంగా గాయపడిన మారేగౌడ్‌ను తుమకూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఎస్‌ఐ లావణ్య వెంటనే ఘటనా స్థలానికి చేరుకొని స్థానికులతో ప్రమాదానికి గల కారణాలు తెలుసుకున్నారు.

లేపాక్షిలో మరొకరు...

లేపాక్షి: మండలంలోని మామిడిమాకులపల్లి గ్రామానికి చెందిన మూర్తి (30) అనే యువకుడు మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. మూర్తి ద్విచక్ర వాహనంలో హిందూపురం నుంచి లేపాక్షికి వస్తుండగా స్థానిక పోలీస్‌స్టేషన్ ముందు వాహనం అదుపు తప్పింది. ఈ ఘటనలో గాయాలపాలైన మూర్తిని 108 వాహనంలో హిందూపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

మెట్ల మార్గం ప్రారంభం

హిందూపురం టౌన్: మండల పరిధిలోని చలివెందలలోని కొండపై వెలిసిన శ్రీదేవి, భూదేవి సమేత గవిరంగనాథస్వామి ఆలయానికి నూతనంగా నిర్మించిన సోపాన మార్గ మెట్ల మార్గాన్ని సోమవారం ప్రారంభించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు గుడ్డంపల్లి వేణురెడ్డి, మాజీ ఎమ్మెల్యే అబ్దుల్‌ఘనీ, వైఎస్సార్‌సీపీ మాజీ సమన్వయకర్త కొండూరు వేణుగోపాల్‌రెడ్డి పాల్గొని మెట్ల మార్గం ప్రారంభించారు. అలాగే గవిరంగనాథస్వామి పాదముద్రశిల స్థాపన, పూజ కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు.



గవిరంగనాథస్వామి ఆలయ మెట్ల మార్గం ప్రారంభించిన దృశ్యం

రేపు వైఎస్సార్‌సీపీ పరిశీలకుడి పర్యటన

మడకశిర: నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ పరిశీలకులు పోకల అశోక్‌కుమార్ గురువారం మడకశిరలో పర్యటిస్తారని ఆయన వ్యక్తిగత కార్యదర్శి ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ఆర్ అండ్‌బీ బంగ్లాలో మధ్యాహ్నం 2 గంటలకు రొళ్ల మండలంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజా ప్రతినిధులతో సమావేశం అవుతారన్నారు. రొళ్ల మండలంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, ముఖ్యనాయకులందరూ సమావేశానికి తప్పక హాజరుకావాలని కోరారు.

మాధవరాయ దేవాలయం అద్భుతం

గోరంట్ల: విజయనగర రాజుల కాలంలో నిర్మించిన పురాతన మాధవరాయ దేవాలయం అద్భుతంగా ఉందని మలేషియా దేశానికి చెందిన అరుణ్‌రాజ్ తెలిపారు. మంగళవారం ఆయన కుటుంబ సభ్యులతో కలసి ఆలయాన్ని సందర్శించుకున్నారు. విజయనగర శిల్ప శైలిని కనులారా వీక్షించాలని తాము రాయలసీమ పర్యాటనుకు విచ్చేశామన్నారు. అరుణ్‌రాజ్‌కు చారిత్రక పరిశోధకుడు మైనాస్వామి శ్రీకృష్ణదేవాలయుల చిత్రాపటాన్ని బాహూకరించారు.



ఆలయ విశిష్టతను అరుణ్‌రాజ్ కుటుంబ సభ్యులకు వివరిస్తున్న మైనాస్వామి

వాల్మీకి జయంతికి తరలిరండి

సోమందేపల్లి: మండల కేంద్రమైన సోమందేపల్లిలో ఈనెల 28న నిర్వహించనున్న వాల్మీకి మహర్షి జయంతి వేడుకలకు తరలిరావాలని వైఎస్సార్‌సీపీ మాజీ మండల కన్వీనర్ వెంకటరత్నం పిలుపునిచ్చారు. మంగళవారం మండలంలోని తుంగోడు, నడింపల్లి, చాలకూరు గ్రామాల్లో వాల్మీకి సంఘం నాయకులు పర్యటించారు. ఈ సందర్భంగా మాజీ కన్వీనర్ వెంకటరత్నం మాట్లాడుతూ ప్రభుత్వం వాల్మీకి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేసిందన్నారు. జ్యోతుల మహోత్సవం, అన్నదాన కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు చెప్పారు.

దిగజారుడు మాటలు మానుకోండి

గుడిబండ: నియోజకవర్గ అభివృద్ధినే పరమావధిగా పని చేస్తున్న ఎమ్మెల్యే తిప్పేస్వామిపై టీడీపీ నాయకులు దిగజారుడు ఆరోపణలు చేయడం మానుకోవాలని ఎంపీపీ రాధమ్మ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ డీఎల్ యంజారేగౌడు, సింగిల్ విండో అధ్యక్షుడు చంద్ర, ఎస్సీ సెల్ కన్వీనర్ రమేష్, ఎస్టీ సెల్ కన్వీనర్ గిరిధర్ హితవు పలికారు. మంగళవారం గుడిబండలోని ఎంపీడీఓ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. వార్డు మెంబర్‌గా కూడా గెలవలేని టీడీపీ కార్యకర్త మంజునాథ్ ఎమ్మెల్యేపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటన్నారు. మరోసారి ఇష్టానుసారంగా ఆరోపణలు చేస్తే తగిన రీతిలో బుద్ధి చెబుతామని హెచ్చరించారు.



మాట్లాడుతున్న ఎంపీపీ రాధమ్మ

మైనార్టీల సంక్షేమానికి పెద్దపీట



ముస్లింలతో సమావేశమైన మాజీ ఎమ్మెల్యే అబ్దుల్‌ఘనీ, వేణురెడ్డి

హిందూపురం: మైనార్టీల సంక్షేమానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పెద్ద పీట వేస్తూ ఎన్నో సంక్షేమ పథకాలు అందించిందని మాజీ ఎమ్మెల్యే అబ్దుల్‌ఘనీ, వైఎస్సార్‌సీపీ నాయకుడు వేణురెడ్డి అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ముస్లిం మైనార్టీలతో సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ త్వరలో హిందూపురంలో ముస్లిం మైనార్టీల ఆత్మీయ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మంత్రి, వైఎస్సార్‌సీపీ రాయలసీమ రీజినల్ కోఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, డిప్యూటీ సీఎం అంజాద్‌బాషా, మైనార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరవుతారన్నారు. ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున ముస్లిం మైనార్టీలు హాజరు కావాలన్నారు.

క్రికెట్ టోర్నీ ప్రారంభం

గుడిబండ: మండలంలోని గుడిబండ–మద్దనకుంట గ్రామం మధ్యలోని క్రీడా మైదానంలో పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం టెన్నిస్‌బాల్ క్రికెట్ టోర్నీని ప్రారంభించారు. అలాగే గుడిబండ జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాల ఆవరణలో వాలీబాల్ టోర్నమెంట్ కూడా నిర్వహిస్తున్నట్లు ఎస్‌ఐ మునిప్రతాప్ తెలిపారు. క్రీడాకారులు టోర్నమెంట్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



పర్యాటకుల సందడి



కుంభకర్ణుడి ప్రాజెక్టు



ఒంటెపై ఊరేగుతున్న యువకుడు



ఉయ్యాల దగ్గర చిన్నారుల సందడి

• సందడే సందడి

పెనుకొండ రూరల్: దసరా పండుగ నేపథ్యంలో పట్టణానికి సమీపంలో ఉన్న కుంభకర్ణుడి ప్రాజెక్టు పర్యాటకులతో కిటకిటలాడింది. ప్రాజెక్టు ఆవరణం లోపల కుంభకర్ణుడు నిద్రిస్తున్న భారీ విగ్రహంతో పాటు దైవత్వాన్ని ప్రతిబింబేలా అక్కడక్కడా బ్రహ్మ, విష్ణు, మహేశ్వరుని విగ్రహాలతో పాటు నంది, సరస్వతి, లక్ష్మి అమ్మవారి విగ్రహాలను ప్రతిష్టించారు. అలాగే ఉయ్యాల, జారుడు బండ, జంపింగ్‌రింగ్ తదితర వాటిని ఏర్పాటు చేయడంతో చిన్నా, పెద్దా అందరూ సంతోషంగా గడిపారు.

సంతోషంగా గడిపారు



కుటుంబంతో కలసి కుంభకర్ణ ప్రాజెక్టుకు వచ్చాం. ఇక్కడ వసతులు కూడా బాగున్నాయి. పర్యాటకులకు ఇబ్బంది లేకుండా ఏర్పాటు చేసిన హోటల్ కూడా బాగుంది. పిల్లలందరూ సంతోషంగా గడిపారు.

– హనీఫ్, కర్నాటకనాగేపల్లి, పుట్టపర్తి

పర్యాటకంగా అభివృద్ధి చెందుతోంది



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో కొండపైకి రోడ్డు నిర్మించడంతో ఆ ప్రాంతమంతా పర్యటకంగా అభివృద్ధి చెందుతోంది. కుంభకర్ణుడి ప్రాజెక్టు ఉన్న ప్రదేశం ఎంతో ఆహ్లాదకరంగా ఉంది. ఇటీవల ఇక్కడికి వస్తున్న పర్యాటకుల సంఖ్య కూడా పెరుగుతోంది.

– ఆదినారాయణరెడ్డి, సమత స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు

అనారోగ్యంతో వైఎస్సార్‌సీపీ నాయకుడి మృతి

గోరంట్ల: మండలంలోని పుట్టగుండ్లపల్లి పంచాయతీ పరిధిలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన సీనియర్ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు, స్టోర్ డీలర్ కత్తి గోపాల్‌రెడ్డి మంగళవారం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న పలువురు వైఎస్సార్‌సీపీ నాయకలు కొత్తపల్లి గ్రామానికి చేరుకొని గోపాల్‌రెడ్డి మృతదేహం వద్ద నివాళులర్పించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

జూదరుల అరెస్టు

తాడిపత్రి అర్బన్: పట్టణంలో పేకాట ఆడుతున్న ఐదుగురు జూదరులను అరెస్టు చేసినట్లు సీఐ హమీద్‌ఖాన్ తెలిపారు. వారి వద్ద నుంచి రూ.28,950 స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. స్థానిక రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద పేకాట ఆడుతున్న రంగమోహన్, క్రిష్టారెడ్డి, రాఘవేంద్ర, హేమంత్, నాగేంద్రను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.